## మూడో విడత బరిలో 1,351 మంది



న్యూఢిల్లీ : మే 7న జరగబోయే మూడో విడత సార్వత్రిక ఎన్నికల్లో 12 రాష్ట్రాలు, యూటీల నుంచి 95 సీట్లలో 1,351 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్టు ఎన్నికల సంఘం మంగళవారం వెల్లడించింది. ఇందులో ఎంపీలోని బీతుల్ నియోజకవర్గ ఎన్నిక కూడా ఉందని తెలిపింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారంతో ముగిసింది. సూరత్ నుంచి బీజేపీ అభ్యర్థి ముఖేష్ దలాల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఈసీ తెలిపింది. మూడో విడత ఎన్నికకు 2,963 నామినేషన్లు దాఖలు కాగా, అందులో 1563 సక్రమంగా ఉన్నట్టు ధ్రువీకరించారు. గుజరాత్‌లోని 26 లోక్‌సభ స్థానాలకు 658, మహారాష్ట్రలోని 11 సీట్లకు 519, మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌లో అత్యధికంగా 77 మంది, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో 68మంది నామినేషన్లు వేశారు.



# ‘హనుమాన్ చాలీసా’ విన్నా నేరమే!

- కాంగ్రెస్ గెలిస్తే ముమ్మాటికీ ఇదే జరుగుతుంది
- మన మత విశ్వాసాలను కూడా ఆచరించలేం
- రాజస్థాన్‌లో మోదీ వివాదాస్పద వ్యాఖ్యలు
- ఎస్సీ, ఎస్టీ కోటా తగ్గించి ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రయత్నించిందని ఆరోపణ
- మోదీ ‘ముస్లిం’ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోండి
- ఈసీకి దేశంలోని 20 వేల మంది మేధావుల లేఖ
- ఫిర్యాదులను పరిశీలిస్తున్నామన్న ఎన్నికల సంఘం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ముస్లింలే లక్ష్యంగా చొరబాటుదారులంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అవే తరహా వ్యాఖ్యలు చేశారు. రాజస్థాన్‌లోని టోంక్‌లో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపిస్తే, వాళ్ల పాలనలో హనుమాన్ చాలీసాను వినడాన్ని కూడా నేరంగా పరిగణిస్తారని అన్నారు. మన విశ్వాసాలను ఆచరించడం కూడా కష్టమేనని ధ్వజమెత్తారు. దేశంలోని ప్రజల సంపదను దోచుకొని, లక్షిత వర్గాల వారికి దాన్ని పునఃపంపిణీ చేస్తుందని కాంగ్రెస్‌పై మరోసారి నిప్పులు చెరిగారు. ఈ విషయాన్ని చెప్తే.. కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు తనను నిందిస్తున్నారన్న మోదీ.. అయినప్పటికీ, ఈ నిజాన్ని తాను దేశ ప్రజలకు చెప్పదలుచుకొన్నట్టు వెల్లడించారు. ఓటు బ్యాంకు, బుజ్జగింపు రాజకీయాలకు కాంగ్రెస్ తెగబడుతున్నట్టు ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ కోటా తగ్గించి ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వాలని 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించిందని, ఆంధ్రప్రదేశ్‌లో దీన్నో పైలట్ ప్రాజెక్టుగా



ప్రారంభించి అనంతరం దేశమంతటా అమలు చేయాలనుకొన్నదని ఆరోపించారు. దీనికోసం రాజ్యాంగ నియమాలను కూడా పట్టించుకోలేదన్నారు. చట్టపరమైన అవరోధాలు, సుప్రీంకోర్టు జోక్యంతో ఇది సాధ్యపడలేదని తెలిపారు.

**ఈసీకి మేధావుల లేఖ**

రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ప్రధాని మోదీ చేసిన విద్వేషపూరిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ దేశవ్యాప్తంగా దాదాపు 20 వేల మంది హక్కుల కార్యకర్తలు, మేధావులు ఎన్నికల సంఘానికి లేఖలు రాశారు. కాగా, ఫిర్యాదులపై తాము పరిశీలిస్తున్నట్టు ఈసీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు జాతీయ న్యూస్ వెబ్‌సైట్ ‘ఇండియా టుడే’ వెల్లడించింది.

### ‘కాంగ్రెస్ వస్తే, షరియా చట్టం’

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, షరియా చట్టాన్ని తీసుకొస్తుందని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ విషయాన్ని ఆ పార్టీ స్పష్టం చేసినట్టు పేర్కొన్నారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దేశద్రోహానికి పాల్పడ్డాయన్న ఆయన.. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

### ‘80% వర్సెస్ 20%’

రానున్న ఎన్నికలు ‘80 శాతం వర్సెస్ 20 శాతం’ ప్రజల మధ్య జరుగుతున్న పోరు అని యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముస్లింలే లక్ష్యంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్టు ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. దేశ ప్రజల మధ్య విభజన రేఖను సృష్టించే కుట్రలకు బీజేపీ సిద్ధమయ్యిందని విరుచుకుపడ్డాయి.

## రాజ్యాంగాన్ని మాపై రుద్దారు!

- మా తలరాతను వేరొకరు రాశారు
- 1961లో పోర్చుగీసుల నుంచి విముక్తి పొందగానే ఇలా చేశారు
- దక్షిణ గోవా కాంగ్రెస్ అభ్యర్థి విరియాటో వివాదాస్పద వ్యాఖ్య
- దేశాన్ని విభజించే కుట్రేనన్న మోదీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రాజ్యాంగాన్ని తమపై బలవంతంగా రుద్దారని దక్షిణ గోవా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి విరియాటో ఫెర్నాండెజ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1961లో పోర్చుగీసుల పాలన నుంచి విముక్తి లభించినప్పటికీ.. తమ తలరాతను మాత్రం వేరొకరు రాసినట్టు చెప్పారు. ఈ మేరకు దక్షిణ గోవాలో సోమవారం జరిగిన ఎన్నికల సభలో మాట్లాడారు. ‘2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీతో మాట్లాడా. గోవా ప్రజలకు ద్వంద్వ పౌరసత్వం ఇవ్వడంపై ఆయనతో చర్చించా. 1961లో గోవాకు విముక్తి లభించగానే, గోవా ప్రజలపై రాజ్యాంగాన్ని బలవంతంగా రుద్దారని చెప్పా. పోర్చుగీసుల నుంచి విముక్తి లభించిన తర్వాత వారి (గోవా ప్రజలు) తలరాత వారే నిర్ణయించుకొంటారని మాజీ ప్రధాని నెహ్రూ చెప్పినట్టు గుర్తు చేశా. అయితే, మా తలరాతను వేరొకరు రాశారని తెలిపా’ అని పేర్కొన్నారు.



**రాజ్యాంగాన్ని కించపరిచేలా..**

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి విరియాటో భారత రాజ్యాంగాన్ని కించపరిచారని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. విభజన రాజకీయాలను కాంగ్రెస్ ఇకనైనా మానుకోవాలని గోవా సీఎం సావంత్ సోషల్‌మీడియాలో విరుచుకుపడ్డారు.

**బీజేపీ నేతలు ఇలా..**

కాంగ్రెస్ నేతలే కాదు.. బీజేపీ నేతలు కూడా రాజ్యాంగంపై వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేసి విమర్శలు ఎదుర్కోవడం ఇటీవలి కాలంలో ఎక్కువైంది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయేకు 400కు పైగా సీట్లను ఇచ్చి గెలిపిస్తే, రాజ్యాంగాన్ని మారుస్తామంటూ బీజేపీ సీనియర్ నేతలు అనంత్‌కుమార్ హెగ్డే, గజేంద్ర సింగ్ షెకావత్, లల్లూ సింగ్, జ్యోతి మిర్ధా, అరుణ్ గోవిల్ వ్యాఖ్యానించడం రాజకీయ దుమారం రేపింది.

## ముస్లింలందరినీ బీసీలను చేస్తారా?

- ఇది అత్యంత వెనకబడ్డ వర్గాలను బలహీనపర్చడమే
- కర్ణాటక రిజర్వేషన్ల విధానంపై బీసీ కమిషన్ ఆగ్రహం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: మొత్తం ముస్లిం సామాజిక వర్గాన్ని వెనుకబడిన కులంగా గుర్తించాలన్న కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై జాతీయ వెనకబడిన తరగతుల కమిషన్(ఎన్‌సీబీసీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలా చేయడం సామాజిక న్యాయ సూత్రాలను బలహీనపరచడమేనని వ్యాఖ్యానించింది. కర్ణాటక వెనకబడిన సంక్షేమ తరగతుల విభాగం సమర్పించిన డాటా ప్రకారం ముస్లిం మతంలోని అన్ని కులాలు, వర్గాలను సామాజికంగా, విద్యా పరంగా వెనకబడిన తరగతులుగా గుర్తించి IIబి విభాగంలో చేర్చారు. గతేడాది ఎన్‌సీబీసీ కర్ణాటకలో పర్యటించినప్పుడు ఓబీసీలకు విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం రూపొందించిన రిజర్వేషన్ల విధానాన్ని పరిశీలించింది. ముస్లిం మతంలోని వర్గాలన్నింటినీ బీసీలుగా గుర్తించడం వల్ల ఆ మతంలో అత్యంత వెనకబడిన వర్గాలను బలహీనపరిచినట్టే అవుతుందని తెలిపింది. ఇలాంటి రిజర్వేషన్లు సామాజిక న్యాయాన్ని మొత్తంగా ప్రభావితం చేస్తాయని.. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపిస్తాయంది. 2011 జనాభా లెక్కల ప్రకారం కర్ణాటక జనాభాలో 12.92 శాతం ముస్లింలున్నారు.

## సూరత్ కాంగ్రెస్ అభ్యర్థి మిస్సింగ్!

**బీజేపీలో చేరబోతున్నట్టు వార్తలు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ బరిలో కాంగ్రెస్ తరుపున నిలబడ్డ అభ్యర్థి నీలేశ్ కుంభని కనిపించట్లేదని స్థానిక మీడియా తెలిపింది. రేపోమాపో ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకోనున్నట్టు వెల్లడించింది. దీంతో కుంభని ఇంటిముందు చేరిన కాంగ్రెస్ కార్యకర్తలు ‘ప్రజాద్రోహి’ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సూరత్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కుట్రలకు పాల్పడిందని కాంగ్రెస్ ఆరోపించింది. కాగా, సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలేశ్ నామినేషన్ తిరస్కరణకు గురవడం, నామినేషన్ల చివరి రోజు మిగతా అభ్యర్థులు ఉపసంహరించుకోవడంతో బీజేపీ అభ్యర్థి ముకేశ్ దలాల్ ఎన్నికను ఏకగ్రీవం చేస్తూ ఎన్నికల కమిషన్ సోమవారం ప్రకటించడం తెలిసిందే.

## మేమే నామినేషన్లు విత్‌డ్రా చేయించాం!

**సూరత్ ఏకగ్రీవంపై బీజేపీ నేత వినోద్ తావ్డే**

ముంబై, ఏప్రిల్ 23: గుజరాత్‌లోని సూరత్ లోక్‌సభ స్థానం ఏకగ్రీవంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే కీలక వ్యాఖ్యలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన వారితో తమ పార్టీనే సంప్రదింపులు జరిపి, నామినేషన్లు విత్‌డ్రా చేసుకునేలా చేసిందని వెల్లడించారు. మంగళవారం ముంబైలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ రాజకీయంగా దిగజారిందన్న విమర్శలపై ఆయన స్పందిస్తూ.. ‘స్వతంత్ర అభ్యర్థులను నామినేషన్లు ఉపసంహరించుకోవాలని అభ్యర్థించాం. వారు ఉపసంహరించుకున్నారు. ఇందులో దిగజారిపోవడం ఏముంది?’ అని ఆయన ఎదురు ప్రశ్నించారు. ఇతర అభ్యర్థులనూ బీజేపీ సంప్రదించిందా అని ప్రశ్నించగా.. అవునని ఆయన పేర్కొన్నారు.

## వీవీప్యాట్లపై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: ఈవీఎంలలో పోలైన ఓట్లను వీవీప్యాట్ స్లిప్‌లతో సరిపోల్చాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించనుంది. వీవీప్యాట్ మెషిన్లపై ఓటరుకు స్లిప్ సులువుగా కనిపించే అద్దం స్థానంలో ఏడు సెకన్ల పాటు లైట్ వచ్చినప్పుడు మాత్రమే కనిపించేలా మరో రకమైన గ్లాస్‌ను ఏర్పాటుచేస్తూ 2017లో ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా ఆదేశించాలని ఏడీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వనుంది.

## ఓటేస్తే అటుకుల ఉప్మా, జిలేబీ, ఐస్‌క్రీమ్ ఫ్రీ

**ఇండోర్‌లో ఫుడ్ షాప్స్ ఆఫర్**

భోపాల్, ఏప్రిల్ 23: ఎన్నికల పోలింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరుతూ, మధ్యప్రదేశ్ ఇండోర్ నగరంలోని ఫుడ్ షాప్స్ యజమానులు ఓటర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. పోలింగ్ మొదలైన తొలి గంటల్లో ఓటేసేవారికి జిలేబీ, ఐస్‌క్రీమ్, అటుకుల ఉప్మా.. ఉచితంగా పంపిణీ చేస్తామని నగరంలోని ఆహార షాపుల యజమానులు తెలిపారు. జిల్లా కలెక్టర్‌తో జరిగిన సమావేశం అనంతరం దుకాణాదారుల సంఘం మంగళవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది.

## కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జ్యుడీషియల్ కస్టడీని ప్రత్యేక జడ్జి మే 7 వరకు పొడిగించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేసిన సీబీఐ, ఈడీ వ్యవహారాల జడ్జి కావేరీ బవేజా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడంతో కేజ్రీవాల్‌కు తక్కువ డోస్ ఇన్సులిన్ ఇచ్చినట్టు తీహార్ జైలు అధికారులు వెల్లడించారు. అయితే గతంలో ఇన్సులిన్ అవసరం లేదన్నవారు ఇప్పుడు ఎందుకిచ్చారని ఆప్ ప్రశ్నించింది.

## ‘10 రోజుల్లో ఎంబీఏ’పై జాగ్రత్త

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: పది రోజుల్లో ఎంబీఏ, పది రోజుల్లో బీబీఏ వంటి ఆన్‌లైన్ ప్రకటనలు చూసి మోసపోవద్దని, వాటికి ఎలాంటి గుర్తింపు కానీ, సాధికారిత కానీ ఉండదని యూజీసీ ఒక ప్రకటనలో విద్యార్థులు, తల్లిదండ్రులను అప్రమత్తం చేసింది. ఎంబీఏ, బీబీఏ లాంటి సంక్షిప్త పదాలతో కొన్ని సంస్థలు/వ్యక్తులు చేస్తున్న ఆన్‌లైన్ ప్రచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. ఆన్‌లైన్ ద్వారా ఉన్నత విద్యను అందించే గుర్తింపు పొందిన సంస్థల లిస్టు www.deb.ugc.ac.inలో ఉందని, విద్యార్థులు తాము చదివే విద్యాసంస్థల పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించింది.

**గడ్డకట్టిన జలపాతంలో చిక్కుకొని..**

## కిర్గిస్థాన్‌లో ఏపీ విద్యార్థి మృతి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాసరి చందు(20) అనే ఓ మెడికల్ విద్యార్థి కిర్గిస్థాన్‌లో మరణించాడు. అక్కడ గడ్డకట్టిన ఒక జలపాతంలో చిక్కుకొని అతను మృతిచెందాడని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. అనకాపల్లికి చెందిన చందు కిర్గిస్థాన్‌లో మెడిసిన్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. చందు మరో నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం జలపాతం వద్దకు విహారయాత్రకు వెళ్లారు.

## మోదీ సర్కార్ నన్ను వెళ్లగొట్టింది

**ఆస్ట్రేలియా జర్నలిస్టు ఆరోపణ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి వార్తల్ని కవరేజ్ చేసిన తర్వాత తనపై కేంద్రం కక్షపూరిత చర్యలకు దిగిందని ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఏబీసీ) దక్షిణాసియా కరస్పాండెంట్ అవనీ దియాస్ ఆరోపించారు. వీసా రెన్యువల్ చేయాలన్న తన అభ్యర్థనను మోదీ సర్కార్ ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవటంతో, అనివార్యంగా దేశం విడిచివెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

## 2జీ తీర్పును సవరించండి!

**స్పెక్ట్రమ్ కేటాయింపుపై సుప్రీంకోర్టును కోరిన కేంద్ర ప్రభుత్వం**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: వేలం ద్వారా మాత్రమే 2జీ స్పెక్ట్రమ్ కేటాయింపులు జరుగాలంటూ 2012లో ఇచ్చిన తీర్పును సవరించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. స్పెక్ట్రమ్ కేటాయింపు కోసం పాలనాపరమైన ప్రక్రియకు అనుమతి ఇవ్వాలని కోరింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా ధర్మాసనం ముందు సోమవారం ఈ విషయాన్ని ప్రస్తావించిన కేంద్రం తరపు న్యాయవాది, అటార్నీ జనరల్ ఆర్ వెంకట రమణి.. వెంటనే తమ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని కోరారు. అయితే తీర్పు సమీక్ష అభ్యర్థనను ఈమెయిల్ ద్వారా పంపిస్తే తాము పరిశీలిస్తామని జస్టిస్ చంద్రచూడ్ సూచించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో 2జీ స్పెక్ట్రమ్ స్కామ్ ఆరోపణలు దేశంలో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం పలు కంపెనీలకు కేటాయించిన 2జీ స్పెక్ట్రమ్ లైసెన్స్‌లను రద్దు చేస్తూ సుప్రీం కోర్టు 2012లో తీర్పు వెలువరించింది. సహజ వనరులను కేటాయింపు లేదా బదిలీ చేసే సమయంలో పారదర్శకంగా వేలం ప్రక్రియను పాటించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేసింది. తద్వారా ఈ వేలం ప్రక్రియలో అర్హులైన వాళ్లు పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయపడింది.

### శిశు సంరక్షణ సెలవులు

## మహిళల రాజ్యాంగ హక్కు

**సుప్రీంకోర్టు స్పష్టీకరణ**




న్యూఢిల్లీ: పని ప్రదేశాల్లో మహిళల హక్కులకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ‘శిశు సంరక్షణ సెలవు’ మహిళలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కుగా పేర్కొన్నది. దివ్యాంగుల పిల్లల సంరక్షణలో ఉన్న తల్లికి శిశు సంరక్షణ సెలవు నిరాకరించటాన్ని తీవ్రమైన సమస్యగా పరిగణించింది. శ్రామికశక్తిలో మహిళలకు సమాన భాగస్వామ్యాన్ని కల్పించటంలో రాష్ట్రం నిర్వర్తించే రాజ్యాంగ విధిని ఇది ఉల్లంఘించటమేనని తెలిపింది. సోమవారం ఓ కేసు విచారణ సందర్భంగా సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో కేంద్రాన్ని కక్షిదారుగా చేర్చాలని అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భట్‌ను ఆదేశించింది. దివ్యాంగుల పిల్లల సంరక్షణలో ఉన్న తల్లులకు ‘శిశు సంరక్షణ సెలవులు’ మంజూరు చేయటంపై విధానపరమైన నిర్ణయం తీసుకునేందుకుగాను రాష్ట్ర సీఎస్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటుచేయాలని హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

# ఒడిశా ఎవరి వశం?

- 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాలకు ఎన్నిక
- 24 ఏండ్లుగా అధికారంలో నవీన్ పట్నాయక్
- మరోసారి గెలుపుపై కన్నేసిన బిజూ జనతాదళ్
- ప్రధాన ప్రతిపక్షంగా రేసులోకి వచ్చిన బీజేపీ
- రెండు పార్టీల స్నేహమే కాంగ్రెస్ ఆయుధం
- ప్రభుత్వ వ్యతిరేకత కలిసొస్తుందని ధీమా
- బీజేడీ – బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ: సర్వేలు

భువనేశ్వర్, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల్లో దేశమంతా ఒక పరిస్థితి ఉంటే ఒడిశాలో మాత్రం విభిన్న రాజకీయ పరిస్థితులు ఉన్నాయి. అన్ని రాష్ట్రాల్లో ప్రత్యర్థి పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంటే ఒడిశాలో మాత్రం స్నేహపూర్వక పోటీ నెలకొన్నది. ఇక్కడ ప్రధానంగా బిజూ జనతాదళ్(బీజేడీ), భారతీయ జనతా పార్టీ(బీజేపీ) పోటీ పడుతున్నాయి. ఈ రెండు పార్టీలు 2009 వరకు పదేండ్ల పాటు మిత్రపక్షాలుగా ఉండేవి. ఆ తర్వాత రెండు పార్టీలు వేరుపడ్డప్పటికీ గత పదేండ్లుగా కేంద్రంలోని మోదీ సర్కారుకు బీజేడీ అనేక అంశాల్లో, బిల్లులపై మద్దతుగా నిలుస్తూ వచ్చింది. ఈ రెండు ఫ్రెండ్లీ పార్టీల మధ్య ఒడిశాలో ప్రధాన పోటీ ఉండగా.. వీటిపై ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతనే ఆయుధంగా కాంగ్రెస్ బరిలో నిలుస్తున్నది. కాగా, ఒడిశాలోని 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాలకు మే 13, 20, 25, జూన్ 1న నాలుగు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి.



**పట్నాయక్ చరిష్మానే బీజేడీ బలం**

24 ఏండ్ల నుంచి ఒడిశా ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ కొనసాగుతున్నారు. మరోసారి అధికారం దక్కించుకుంటామని ఆయన నమ్మకంగా ఉన్నారు. ఒడిశా ప్రజల్లో ఆయనకు మంచి చరిష్మా ఉంది. అయితే, ఈ ఎన్నికల్లో ఆయనకు అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి. బీజేడీలో నవీన్ పట్నాయక్ తప్పించి మరో బలమైన నేత లేకపోవడం, అనేక నియోజకవర్గాల్లో పార్టీలోనే అసమ్మతి కూడా బీజేడీకి మైనస్‌గా కనిపిస్తున్నది.

**అధికారంపై కన్నేసిన బీజేపీ**

బీజేడీతో స్నేహంగా ఉంటూనే ఒడిశాలో విస్తరించింది బీజేపీ. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా కమలం పార్టీ కొనసాగుతున్నది. 2014 ఎన్నికల్లో 21 లోక్‌సభ స్థానాలకు కేవలం ఒక్క స్థానానికి పరిమితమైన కమలం పార్టీ 2019 నాటికి ఎనిమిది స్థానాలకు ఎగబాకింది. ఈసారి మెజారిటీ లోక్‌సభ స్థానాలతో పాటు రాష్ట్రంలో అధికారాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నది. నరేంద్ర మోదీ చరిష్మా, హిందుత్వ నినాదం, అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి అంశాలు తమకు కలిసొస్తాయని బీజేపీ భావిస్తున్నది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ 38.4 శాతం ఓట్లతో ఎనిమిది స్థానాలు సాధించినప్పటికీ.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 32 శాతం ఓట్లతో 23 సీట్లకే పరిమితమైంది.

**ప్రభుత్వ వ్యతిరేకతపై కాంగ్రెస్ ఆశలు**

ఒకప్పుడు ఒడిశాలో వెలుగు వెలిగిన కాంగ్రెస్ పార్టీ క్రమంగా బలహీనపడుతూ వచ్చింది. 2014లో 26 శాతం ఓట్లు సాధించిన కాంగ్రెస్ 2019 నాటికి 13 శాతానికి పరిమితమైంది. ఇప్పుడు కనీసం రెండో స్థానానికైనా రావాలని భావిస్తున్నది.

**రెండు పార్టీల మధ్యే పోరు**

ఒడిశాలో బీజేడీ – బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొన్నదని సర్వేలు అంచనా వేస్తున్నాయి. దాదాపుగా అన్ని సర్వేలు కూడా ఈ రెండు పార్టీలు అటుఇటుగా చెరో 40 శాతం ఓట్లు, 10 – 12 సీట్లు గెలుస్తాయని అంచనా వేశాయి.

## పేరెంట్స్ పక్కనే పిల్లలకు సీట్లు

**ఎయిర్‌లైన్స్‌కు డీజీసీఏ ఆదేశాలు**

న్యూఢిల్లీ: విమానాల్లో 12 ఏండ్లలోపు పిల్లలకు వారి తల్లిదండ్రుల పక్కనే సీటు కేటాయించాలని విమానయాన సంస్థలకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆదేశాలు జారీచేసింది. పిల్లల సీటింగ్ సమస్యలను పరిష్కరించేలా నిబంధనలు సవరించినట్టు పేర్కొన్నది. మరోవైపు, విమానసంస్థలకు కొన్ని వెసులుబాట్లు కల్పించింది. జీరో బ్యాగేజ్, సీటింగ్ ప్రాధాన్యం, మీల్స్/స్నాక్స్/డ్రింక్స్, సంగీత పరికరాలు తీసుకెళ్లడానికి రుసుములు వసూలు చేయొచ్చని తెలిపింది.

## జనరల్ ప్రయాణికులకు సరసమైన ధరకే భోజనం

**రైల్వే శాఖ కొత్త సౌకర్యం**

న్యూఢిల్లీ: జనరల్ క్లాస్ ప్రయాణికులకు ఆహారం అందించేందుకు రైల్వే శాఖ ఇటీవల ఓ కొత్త సౌకర్యాన్ని ప్రారంభించింది. దీని కింద రైళ్లలోని అన్‌రిజర్వ్‌డ్ బోగీల్లో ప్రయాణించే ప్యాసెంజర్లు సరసమైన ధరల్లో పరిశుభ్రమైన భోజనం, స్నాక్స్ పొందగలరని రైల్వే అధికారి ఒకరు తెలిపారు. మీల్ కౌంటర్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండేలా జనరల్ కోచ్‌లు ఉండే ఫ్లాట్‌ఫాం ఏరియాలో ఉంటాయన్నారు. ఎకానమీ మీల్ రూ.20, స్నాక్ మీల్ రూ.50 అనే రెండు క్యాటగిరీలుగా ఉంటుందని, నేరుగా కౌంటర్ల వద్ద కొనుగోలు చేయవచ్చన్నారు.

## యాడ్ సైజ్‌లోనే క్షమాపణలు ఉన్నాయా?

**పతంజలిని ప్రశ్నించిన సుప్రీం**

న్యూఢిల్లీ: తప్పుదోవ పట్టించే ప్రకటనలకు సంబంధించిన కేసులో బహిరంగ క్షమాపణలు చెబుతూ దేశవ్యాప్తంగా 67 పత్రికల్లో ప్రకటనలు ఇచ్చామని పతంజలి సంస్థ మంగళవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. తప్పుదోవ పట్టించే యాడ్‌ల సైజ్‌లోనే, అదే ఫాంట్‌లో క్షమాపణల ప్రకటనలు ఇచ్చారా? అని ప్రశ్నించింది. రెండు రోజుల్లో పత్రికల్లో ప్రచురితమైన ప్రకటనలను సమర్పించాలని పతంజలి ఎండీ ఆచార్య బాలకృష్ణ, సంస్థ సహ వ్యవస్థాపకుడు, యోగాగురు బాబా రాందేవ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది.



## కవిత్వం రాసే కెమెరా

న్యూయార్క్, ఏప్రిల్ 23: ఏదైనా చూడచక్కని ప్రదేశాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని చూసినప్పుడు వాటిని వర్ణిస్తూ కవితలు రాస్తుంటారు కవులు. ఇక, నుంచి ఈ పని కూడా కృత్రిమ మేధ(ఏఐ) చేయబోతున్నది. కెలిన్ కరోలిన్ ఝూంగ్, ర్యాన్ మాథెర్ కలిసి ‘పొయెట్రీ కెమెరా’ను తయారుచేశారు. ఈ కెమెరాతో ఫొటో తీసినప్పుడు ఫొటోతో పాటు ఆ చిత్రాన్ని వర్ణిస్తూ రంగులు, మనుషులు, వస్తువులు, వంటివాటిని విశ్లేషించి రాసే ఈ కవిత అప్పటికప్పుడే చిన్న చీటీపై ప్రింట్ అయి బయటకు వస్తుంది.

## ఇంటర్నెట్ లేకున్నా ఫైల్స్ పంపించొచ్చు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 23: ఇంటర్నెట్ లేకపోయినా ఫొటోలు, వీడియోలు, ఫైల్స్‌ను ఇతరులకు ఆఫ్‌లైన్‌లోనే షేర్ చేసే సదుపాయాన్ని ప్రముఖ సోషల్ మీడియా దిగ్గజం వాట్సాప్ త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నది. ఈ ఫీచర్ ద్వారా ఇకపై నెట్‌వర్క్‌తో పనిలేకుండా డాక్యుమెంట్లను పంపించొచ్చు. ప్రస్తుతం ఇంటర్నెట్ లేకుండా షేర్ ఇట్ వంటి వాటి ద్వారా ఫొటోలు, వీడియోలను షేర్ చేసుకొంటున్న మాదిరిగానే.. ఆ తరహా సేవల్నే వాట్సాప్ అందుబాటులోకి తేనున్నది. ఈ ఫీచర్‌ను ఎనేబుల్ చేసుకోవాలంటే యాక్సెస్ అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.



## ఈ టాయిలెట్.. ఒక ల్యాబ్

బీజింగ్, ఏప్రిల్ 23: భవిష్యత్తులో యూరిన్ టెస్టు కోసం ల్యాబ్‌కు వెళ్లి శాంపిల్ ఇవ్వాల్సిన అవసరం పడదేమో! టాయిలెట్‌లో మూత్రవిసర్జన చేయగానే మీ ఆరోగ్యం ఎలా ఉందో పూర్తి రిపోర్ట్ ఇచ్చే అత్యాధునిక టాయిలెట్లు అందుబాటులోకి వచ్చాయి. చైనాలోని బీజింగ్, షాంఘైలో పలు పురుషుల మూత్రశాలల్లో ఓ ప్రైవేటు కంపెనీ ఈ హైటెక్ టాయిలెట్లు అమర్చింది. షాంఘైకు చెందిన క్రిస్టియన్ పీటర్‌సన్–క్లాసెన్ అనే డైరెక్టర్ ‘ఎక్స్’లో ఈ టాయిలెట్లకు సంబంధించిన ఒక పోస్ట్ చేశారు.

## బిడ్డను కంటే 61 లక్షలు!

- దక్షిణ కొరియా ప్రభుత్వం యోచన
- దేశంలో పడిపోయిన జననాల రేటు



సియోల్, ఏప్రిల్ 23: దక్షిణ కొరియాలో జనాభా సంక్షోభం నెలకొన్నది. ఈ నేపథ్యంలో దేశంలో జనన రేటును పెంచేందుకు ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రతి బిడ్డకు జన్మనిచ్చే తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా 59 వేల పౌండ్లు(దాదాపు రూ.61 లక్షలు) నగదు ఇచ్చే విషయాన్ని సర్కార్ పరిశీలిస్తున్నదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమాన్ని అమలు చేసే ముందు ఒక పబ్లిక్ సర్వేను నిర్వహిస్తున్నది. దక్షిణ కొరియాలో జననాల రేటు భారీగా పడిపోయింది. 2023లో ఇది 0.72కు తగ్గింది. అంటే దేశంలోని ప్రతి మహిళ ఒక్క బిడ్డకు కూడా జన్మనివ్వట్లేదు అన్నమాట. 2023లో నమోదైన జాతీయ జనన రేటు దేశ చరిత్రలోనే అత్యంత కనిష్ఠం. దేశంలో జనాభా సంక్షోభానికి అనేక కారణాలు ఉన్నాయి. పెరిగిన జీవన వ్యయం, తగ్గిన జీవన నాణ్యత.. వెరసి దంపతులు వివాహ బంధానికి, పిల్లలను కనేందుకు విముఖత చూపుతున్నారు. జనన రేటును పెంచేందుకు ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నది.